04032025-DIS-04_Layout 1 3/4/2025 2:54 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## దౌత్య వైపరీత్యం

**అమెరికా** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మధ్య శ్వేతసౌధం సాక్షిగా జరిగిన తగాదా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. 1971, అక్టోబర్‌లో అప్పటి పాక్ సైనిక ప్రభుత్వం, తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో జరుపుతున్న నరమేధంపై నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్, భారత ప్రధాని ఇందిరాగాంధీకి మధ్య తీవ్రస్థాయిలో జరిగిన చర్చను ఇది గుర్తు చేసింది. ఎవరు దురాక్రమణకు దిగారు, ఎవరు బాధితులనేది అప్పటి అమెరికా అధ్యక్షుడైన నిక్సన్ పట్టించుకోలేదు. ఇప్పటి అధ్యక్షుడు ట్రంప్ కూడా పట్టించుకోవడం లేదు. స్పష్టంగా చెప్పాలంటే అమెరికాకు ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యం. అన్ని సంబంధాలు ఆర్థిక సంబంధాలే అంటుంది మార్క్సిజం. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఉన్న సంబంధాలు అలాంటివే. ట్రంప్ వృత్తిపరమైన రాజకీయవేత్త కాదు, ఆయన ఓ వ్యాపారి. ఏదైనా పని తలపెట్టాలంటే దానివల్ల కలిగే లబ్ధి ఏమిటనేది చూడటం వ్యాపార లక్షణం. ఇక్కడ శాంతి పేరిట ఒక ఒడంబడిక లాంటిది ట్రంప్ సిద్ధం చేసుకున్నట్టు కనిపిస్తున్నది. అది పూర్తిగా రష్యాకు అనుకూలంగా, ఉక్రెయిన్‌కు, తద్వారా నాటో దేశాలకు భద్రతా పరంగా వ్యతిరేకంగా ఉందనేది బహిరంగ రహస్యమే. కానీ, ట్రంప్ అవేవీ పట్టించుకోవడం లేదు. అమెరికా అందించిన సాయం పూర్తిగా నిరర్థకమైపోయినట్టుగా ఆయన వాపోతున్నారు. ఉక్రెయిన్‌కు అమెరికా భారీ సాయమే అందించింది. అదీ, రష్యాతో యుద్ధం చేసేందుకు. అందుకు సరైన కృతజ్ఞత ఉక్రెయిన్ నుంచి రావడం లేదనేది ట్రంప్ ఫిర్యాదు. ఆ కృతజ్ఞతా భావం ఏ రూపంలో రావాలని ట్రంప్ ఆశిస్తున్నారనేది ఆలోచిస్తే అసలు సంగతి అర్థమవుతుంది.

ఉక్రెయిన్‌లో ఉన్న ఖనిజ సంపదను, మరీ ముఖ్యంగా అధునిక సాంకేతికతకు కీలక వనరైన లిథియం గనులను అమెరికాకు అప్పగించాలనేది ట్రంప్ పంతం. అంటే, అమెరికా చేసిన సాయానికి ప్రతిఫలంగా ఉక్రెయిన్ తన సహజ సంపదలను తమకు ధారాదత్తం చేయాలనడం ఒక రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్ ధోరణిని తలపిస్తున్నది. మరీ ఇంత బహిరంగంగా, మీడియా సమక్షంలో జరిగిన చర్చలో ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ డిమాండ్లను ముందుకుతేవడం కొంచెం విచిత్రంగానే అనిపిస్తున్నప్పటికీ, అమెరికా ప్రయోజనాల దృష్ట్యా ట్రంప్ ఆలోచిస్తున్నది అదే. మీడియా సమావేశంలో జరిగిన సంవాదంలో ట్రంప్ డిమాండ్లను జెలెన్‌స్కీ నిరాకరించడం సబబే అని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇంత గడుసైన రీతిలో వ్యవహరిస్తున్నప్పుడు దానికి తాను బహిరంగంగా తలొగ్గినట్టు కనిపించడం ఏ అధ్యక్షుడికీ ఇష్టం ఉండదు. అలాంటి చర్య ఉక్రెయిన్‌లో జెలన్‌స్కీ పరపతిని పూర్తిగా ధ్వంసం చేస్తుందన్న సంగతి అందరికీ తెలుసు. ఈ వాగ్యుద్ధం తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడిని, ఆయన వెంట వచ్చిన ప్రతినిధి బృందాన్ని అవమానకరమైన రీతిలో బయటకు పంపించి వేశారనే వార్త మరింత విస్మయం కలిగిస్తున్నది.

యుద్ధ సాయం విషయంలో అమెరికా వెనక్కి తగ్గడం వల్ల అటు 'నాటో'లోనూ లుకలుకలు బయలుదేరాయి. ట్రంప్ మొదటి నుంచీ నాటోకు వ్యతిరేకమే. నాటోలాంటి గుదిబండలు అమెరికాకు అవసరం లేదన్నది ట్రంప్ ఆలోచన. ట్రంప్ ధోరణి పట్ల మొదట్లో కొంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, ఉక్రెయిన్ విషయంలో ముందుకు వెళ్లాలా? వద్దా? అన్నదానిపై నాటో దేశాల్లోనూ తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా చేసిన సాయానికి కృతజ్ఞతగా ఉంటామని జెలెన్‌స్కీ చేసిన తాజా ప్రకటనను నిస్సహాయస్థితిలో వ్యక్తమైన అనివార్యతగా భావించాలి. వైట్‌హౌస్‌లో ఒప్పుకోనప్పటికీ, మరో రకంగా అమెరికా ముందు ఉక్రెయిన్ మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడిందా? అన్నది నిజానికి దగ్గరగా ఉన్న అనుమానం. అయితే, అమెరికా ఇలా బాహాటంగా తనకు ఆర్థిక ప్రయోజనాలే ముఖ్యమని తెగింపు చూపడం ప్రపంచ దేశాలను సమస్యల నుంచి బయటపడేయడం మాటేమో గానీ మరింతగా సంక్షోభంలోకి కూరుకుపోయేలా చేసే అవకాశం ఉంది.

# ఫ్యూడల్ రెడ్లు కాంప్రడార్ క్లాసా?



టంకశాల అశోక్


**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంజన్‌కుమార్ యాదవ్ గత నెల 24న తమ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణను అడ్డుకున్నది తమ పార్టీకి చెందిన రెడ్డి నాయకులేనని అన్నారు. వారిపై మరికొన్ని వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ వార్తలు అన్నింటిలో వెలువడినందున ఆయన ఆ మాటలు అనటం నిజమే అనుకోవాలి. తన వ్యాఖ్యలు సంచలనం రేపగా, బహుశా పార్టీ నుంచి ఒత్తిడి రావటం వల్ల కావచ్చు, తాను ఏ సామాజిక వర్గాన్ని 'దూషించలేద'ంటూ వివరణ ఇచ్చారు. 'దూషించ' లేదన్నారు గానీ, వారు తెలంగాణకు అడ్డు పడినారన్న మాటలను మాత్రం ఉపసంహరించుకోకపోవటం గమనించదగినది.**

అంజన్‌కుమార్ యాదవ్ మాజీ ఎంపీ కావటమే గాక, ప్రస్తుతం పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులలో ఒకరు. అందువల్ల ఆయన మాటలకు తగిన విలువ సహజంగానే ఉంటుంది. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ వైఖరి ఏమిటన్నది మొదటినుంచి అందరికీ తెలిసిందే. కేంద్రం 1953లో ఫజల్ అలీ కమిషన్‌ను నియమించినప్పుడు, తెలంగాణ ప్రజలు కాదన్నా సీమాంధ్ర ధనిక వర్గాల ప్రభావానికి లోనై 1956లో ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసినప్పుడు, 1969-70 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని సీమాంధ్ర పాలకులు అణచివేసినప్పుడు, 1990ల చివర తిరిగి మొదలై 2001లో టీఆర్‌ఎస్ స్థాపన నుంచి ఉధృతంగా సాగినప్పుడు, రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలలో మంత్రులుగా ఉండి కపట రాజకీయాలు చేసినప్పుడు, సోనియాగాంధీ అనుకూల వైఖరి చూపుతుండిన దశలోనూ ఇక్కడొక మాట, ఢిల్లీలో మరొక మాటల నాటకం ప్రదర్శిస్తుండినపుడు, ప్రతి ఒక్క దశలోనూ వారు చేసిందేమిటన్నది ఎంతమాత్రం రహస్యం కాదు.

అంజన్‌కుమార్ యాదవ్ పార్టీ సీనియర్ నాయకుడిగా ఇదంతా స్వయంగా గమనించిన వ్యక్తి. తెలంగాణను ప్రేమించినవాడు. అందువల్లనే, 'కాలికి పెడితే మెడకు, మెడకు పెడితే కాలికి పెట్టి తెలంగాణను ఇవ్వకుండా కన్నమ్మ బాధలు పెట్టా'రని సాధికారికంగా చెప్పగలిగారు. వీరంతా ఎంత వ్యతిరేకించి ఎన్ని నాటకాలాడినా సోనియగాంధీ గట్టిగా పట్టుబట్టడం వల్లనే తెలంగాణ వచ్చిందన్నారు. అనగా, ఆమె ఆ వైఖరి తీసుకోనట్టయితే, తెలంగాణ వ్యతిరేకులైన ఈ వర్గం సీమాంధ్ర ధనిక పాలక వర్గాలకు యథావిధిగా ఊడిగం చేస్తూ ప్రత్యేక రాష్ట్రం రాకుండా ఆపి ఉండేదన్న మాట. ఈ వర్గాలు ఇప్పుడు తమ ద్రోహ పాత్రను సోనియా సానుకూలత వెనుక కప్పిపెట్టుకుంటూ, 'ఇచ్చింది సోనియా, తెచ్చింది కాంగ్రెస్' అని ప్రచారాలు చేసి ప్రజల కండ్లుగప్పి లాభపడజూస్తున్నారు. ఇది మరొక కపటపు ఎత్తుగడ. ఆ కాలమంతా వాస్తవంగా జరిగిందేమిటన్న తెర వెనుక కథను అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు వెల్లడించిన పక్షంలో, ఈ వర్గాల సైంధవ పాత్ర ప్రజలకు ఇంకా బాగా తెలియవస్తుంది.

> **అట్లా అడ్డుపడి కాంగ్రెస్ వారిలో వేర్వేరు సామాజిక తరగతుల వారున్నా, ప్రధానమైన పాత్ర, నాయకత్వం ఇక్కడి ఫ్యూడల్ రెడ్లదే. రెడ్లలో అందరూ ఫ్యూడల్ తరగతి కాదు. ఆ తరగతిలో తెలంగాణ వెనుకబాటుతనం వల్ల స్వయంగా పీడితులైన వారు, అందుకు వ్యతిరేకంగా రకరకాలుగా తిరగబడినవారే అధిక సంఖ్యలో ఉన్నారు. కాకపోతే ఎప్పుడైనా ధన బలం, రాజకీయ బలం గలవారే ఒక ఉన్నత తరగతిగా ఏర్పడి వ్యవహారాలు నడుపుతారు. తెలంగాణ ఫ్యూడల్ రెడ్లు కూడా అదే పనిచేశారు. అందువల్లనే వారిని కాంప్రడార్ క్లాస్ అనవలసి వస్తున్నది. ఆ సూత్రీకరణ ప్రకారం వారు చేసిందేమిటో చూసేముందు ఆ మాటకు అర్థమేమిటో తెలుసుకోవాలి.**

కాంప్రడార్, కాంప్రడార్ క్లాస్ అన్నవి అకడమిక్ పరిభాషా పదాలు. కాంప్రడార్ అనే మాటకు నిర్వచనం ఈ విధంగా ఉంది. 'పెట్టుబడులు, వ్యాపారం, లేదా ఆర్థిక, రాజకీయ దోపిడీలో విదేశీ సంస్థలకు ఏజెంట్‌గా పనిచేసే వ్యక్తి. విజయవంతంగా పనిచేసే కాంప్రడార్లు చాలా సంపదలను గడిస్తారు' ఇక కాంప్రడార్ క్లాస్ అన్నమాటకు నిర్వచనం ఏమిటి? 'వలసపాలన నుంచి స్వాతంత్ర్యానికి మారే సమయంలో కాంప్రడార్లు స్థానిక దళారీలుగా తయారై, పాలకుల కోసం ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టడం, వలస ప్రాంతాల నిర్వహణను చూడటం వంటివి చేస్తారు. ఈ కొత్త తరగతి, విదేశీ పెట్టుబడులతో దానికి ఉండే సన్నిహిత సంబంధాలూ నయా వలసవాదానికి మార్గాన్ని సుగమం చేస్తాయి.' దీని అర్థాన్నంతా సూటిగా, నిర్మొహమాటంగా, సామాన్య ప్రజల పరిభాషలో చెప్పాలంటే, తమ స్వార్థంతో పాటు బయటివారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు నెరవేరే విధంగా వారి ఏజెంట్లుగా పనిచేసే తొత్తుల తరగతి అన్నమాట.




ఇదే విషయం అంజన్ కుమార్ యాదవ్ తన పద్ధతిలో తాను వెల్లడించారు. అయితే, వీరికి ఈ స్వభావం 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతున్న దశ నుంచి వచ్చింది కాదు. ఆ తర్వాత పైన పేర్కొన్న వివిధ దశలలో కొనసాగింది మాత్రమే కాదు. ఇందుకు పునాదులు నిజాం పాలనా కాలం నుంచే పడ్డాయి. అప్పటి ఆర్థిక వ్యవస్థ, భూమి వ్యవస్థ నిర్మాణాన్ని బట్టి వీరు ఒక ఫ్యూడల్ తరగతి. రాజకీయ, సామాజిక వ్యవస్థను బట్టి పెత్తందారీ తరగతి. ఆ రెండు విధాలుగానూ ప్రభువులకు ఏజెంట్లు. అందువల్ల బాధలకు గురవుతుండిన ప్రజలను, నిరసిస్తుండిన ప్రజలను ఆ ప్రభువుల కోసం, తమ కోసం, ప్రభువుల సైన్యాలతో, తమ సొంత బలగాలతో వారు అణచివేశారు. ఇవన్నీ కాంప్రడార్ లక్షణాలు.

భారతదేశం స్వతంత్రం కావటం, పాత ప్రభువులు పోవటం, ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలు ఏర్పడటంతో సాంకేతికంగా ఆ దశ ముగిసిపోయింది. అటువంటపుడు గతకాలపు కాంప్రడార్ తరగతికి అందుకు తగిన జ్ఞానోదయం, చైతన్యంతో పాటు, ఆర్థికంగా, రాజకీయంగా స్వతంత్రంగా ఎదిగేందుకు అదొక మంచి అవకాశం అనే స్పృహ కలిగిన పక్షంలో, వారిక ఆ విధంగానే ఎదగజూస్తారు. తమ నేలను అదే మార్గంలో నిలబెట్టి స్వతంత్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తారు. అంతే తప్ప, సరికొత్త ప్రభువులుగా రాగోరే వారిని అనుమతించరు. వారికి తిరిగి కాంప్రడార్ ఏజెంట్లుగా మారరు.

1953లో హైదరాబాద్ రాష్ట్రం అవతరించి 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన మధ్యకాలంలో ఈ తరగతి ఆలోచనలు, కార్య విధానాలు ఏ విధంగా ఉండేవో తెలియదు గానీ, సరిగా అవే మూడు సంవత్సరాల కాలంలో ఫజల్ అలీ కమిషన్‌కు, ఆంధ్ర రాష్ట్రంతో విలీనానికి మధ్య వారి కాంప్రడార్ స్వభావం మాత్రం మారలేదన్నది స్పష్టం. నిజాం ఫ్యూడల్ వ్యవస్థలో వీరికి విస్తారమైన భూములున్నా నీటి వసతి, వ్యవసాయ సంపదలు, వాటిని పెట్టుబడి పెట్టి వ్యాపార, పారిశ్రామిక దశలోకి ప్రవేశించకపోవటంతో తెలంగాణ జాతి స్పృహ ఏర్పడక, ఈ నేలపై, ప్రజలపై ప్రేమ కలగలేదు. దానితో ఆంధ్రప్రదేశ్ ఏర్పడగా వచ్చిన అటువంటి కోస్తా తరగతిపై ఆధారపడిపోయారు. ఎమ్మెల్యేల సంఖ్య రీత్యా తాము మైనారిటీ అయి కోస్తావారు మెజారిటీ కావటం అందుకు తోడైంది. కేంద్రంలోనూ కోస్తా వారిదే పైచేయి అయింది.

ఆ విధంగా వారి కాంప్రడార్ చరిత్రలో 1956 నుంచి రెండవ అధ్యాయం మొదలైంది. అప్పటినుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు 58 సంవత్సరాల సుదీర్ఘకాలంలోనూ వారి స్వభావంలో మార్పు లేకపోవటమన్నది ఒక చారిత్రక విషాదం. ఆ కాంప్రడార్ ఫ్రేమ్ వర్క్ నుంచి వారు బయటపడలేకపోయారు. ఆ దశాబ్దాల పొడవునా వారు గతంలో వలెనే ప్రభువులపై ఆధారపడే డిపెండెంట్ క్లాస్‌గా, వారితో కుమ్మక్కై ప్రజలను పీడించి అణచివేసే కొల్లాబరేటివ్ క్లాస్‌గా మారి, సీమాంధ్ర పాలక వర్గాలకు ఊడిగం చేశారు. ఒక క్లాసికల్ కాంప్రడార్ క్లాస్‌గా వ్యవహరించారు. నిజాం పోయినప్పుడు ఏర్పడని స్పృహ, 58 ఏండ్ల తర్వాత తెలంగాణ ప్రజలు తమంతట తాము పట్టువదలక పోరాడి, త్యాగాలు చేసి, సీమాంధ్ర ప్రభువులను పారదోలే వరకు కూడా ఏర్పడలేదు. ఆ ప్రభువులపై రాజకీయ అవకాశాల కోసం, ఆర్థికావకాశాల కోసం ఆధారపడుతూ తమ ప్రజలకు, నేలకు చెప్పరానంత ద్రోహం చేశారు.

అందువల్లనే, అంజన్ కుమార్ యాదవ్ మాటల్లోనే మరొక మారు చెప్పుకోవాలంటే, 'కాలికి పెడితే మెడకు, మెడకు పెడితే కాలికి పెట్టి తెలంగాణను ఇవ్వకుండా కన్నమ్మ బాధలు పెట్టారు'. ఈ విధమైన తమ అనుభవాలను బట్టి తెలంగాణ ప్రజలు, ఒక కాంప్రడార్ తరగతి ఏమిటి, అది చేసే నష్టాలూ ద్రోహాలు ఏమిటనే చారిత్రక పాఠాలను నేర్వటం అవసరం. ఆ తరగతిని ప్రతిఘటించటం ఎట్లానో కూడా వారికి తెలియాలి. ఈ మాటలు కాంగ్రెస్‌లోని, నాన్-ఫ్యూడల్, నాన్-కాంప్రడార్ వర్గాలకు కూడా వర్తిస్తాయి.



## ఫిరాయింపు ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు



డాక్టర్ బీఎన్ రావు
98668 34717

**బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు అందులో ఉండలేక, వెళ్లలేక మథన పడుతున్నారు. అంతేకాదు, వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో తెలియక బుర్రలు బద్దలుగొట్టుకుంటున్నారు. కాంగ్రెస్‌తో అంటకాగుతూ తామింకా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలమేనని చెప్పుకోవాల్సిన పరిస్థితిలో కూరుకుపోయారు. అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి అనేక దారులు వెతుకుతున్నప్పటికీ వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యే అవకాశాలున్నాయి.**

ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పార్టీ విప్‌ను ధిక్కరిస్తే ఏమవుతుందో, కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయకపోతే ఏమవుతుందో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలని బీఆర్‌ఎస్ ప్రత్యక్షంగా పోరాడుతుండటం, సుప్రీంకోర్టు కూడా కొరడా ఝుళిపించేందుకు రెడీ అవుతుండటంతో కక్కలేక, మింగలేకపోతున్నారు. హస్తం పార్టీని నమ్మి తమ హస్తవాసిని చేతులారా నాశనం చేసుకున్నామని ఇప్పుడు బాధపడుతున్నారు. అదే సమయంలో ప్రజావ్యతిరేకతకు తోడు ఫిరాయింపుల కేసు మెడకు చుట్టుకోవడంతో కాంగ్రెస్ సర్కారు ఆగమాగం అవుతున్నది. తన పీకల మీదికి తెచ్చిన ఈ కేసు నుంచి ఎమ్మెల్యేలను తప్పించేందుకు తన రాజకీయ గురువు చంద్రబాబును రేవంత్ అనుసరిస్తున్నారు. తమ అనుకూల పత్రికలు, ఆస్థాన మీడియా ద్వారా లేనిపోని కథనాలను వండి వారుస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మాజీమంత్రి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, నాలుగు మంత్రి పదవులు ఇస్తే లెజిస్లేటివ్ పార్టీని విలీనం చేస్తామని అన్నట్టు రాశారు. ఈ దెబ్బతో ప్రతిపక్షాలు సైలెంట్ అయిపోతాయని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. కానీ, ఆ పాచిక పారలేదు. అనుకూల మీడియాను వాడుకుని రాజకీయ ప్రత్యర్థులపై విషం చిమ్మడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య.

> **ఉమ్మడి ఏపీలో 1994 ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని చంద్రబాబు అస్సలు ఊహించలేదు. మెజారిటీ సీట్లు వచ్చినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లు రాకపోవచ్చని, అదే జరిగితే కాంగ్రెస్ సభ్యులను లాక్కొని ముఖ్యమంత్రి కావాలని భావించారు. కానీ ప్లాన్ బెడిసికొట్టడంతో ఎన్టీ రామారావును గద్దె దించి తాను ముఖ్యమంత్రి అయ్యేందుకు వైస్రాయ్ హోటల్‌ను వేదికగా మార్చుకున్నారు.**

చంద్రబాబుకు మద్దతునిచ్చే ఎమ్మెల్యేలు వేళ్లపై లెక్కపెట్టేంతమంది ఉన్నా, తన అనుకూల పత్రికల సాయంతో చంద్రబాబుకు పార్టీ ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తున్నట్టు రాయించారు. దీంతో ఎమ్మెల్యేలు, తటస్థులు అయోమయానికి గురయ్యారు. పదవులు కోల్పోతామేమోననే భయంతో చంద్రబాబు వర్గంలో చేరిపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా అనుకూల మీడియాను అడ్డంపెట్టుకుని చంద్రబాబు వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కాపాడుకొనేందుకు అనుకూల మీడియాలో వార్తలు రాయిస్తున్నారు. తద్వారా ఎమ్మెల్యేలను ఆత్మరక్షణలో పడేయాలని చూస్తున్నారు. ఈ వార్త నిజమని ఒకరిద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గోడ దూకినా ఈ విపత్కర పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు నైతికంగా బలం చేకూరుతుందని భావిస్తున్నారు. కానీ, ఏడాది తిరక్కముందే సర్కారు ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోవడంతో ఎమ్మెల్యేలు కాదు కదా.. వార్డు సభ్యులు కూడా కాంగ్రెస్ వైపు చూడటం లేదు.

తాము గేట్లు మూసేసినా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గోడలు దూకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని గతంలో రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికారు. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో గేట్లు బార్లా తెరిచినా ఒక్కరు కూడా అటు వైపు అడుగు పెట్టేందుకు సిద్ధంగా లేరనే విషయం వారికి కూడా తెలుసు. ఇప్పటికే గోడ దూకిన ఎమ్మెల్యేలు అనవసరంగా వెళ్లామని చింతిస్తున్నారు. తిరిగి సొంతగూటికి వెళ్లేందుకు దారులు వెతుకుతున్నారు. ఆ అవకాశం లేకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోయిందని వాపోతున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు తహతహలాడుతున్నారు. తద్వారా ఒకవేళ ఎన్నికలు వచ్చినా కేసీఆర్ పేరు వాడుకొని మరోసారి బయటపడదామని కుయుక్తులు పన్నుతున్నారు. అందుకే ఉన్నవాళ్లను కాపాడుకోవడానికి ఆస్థాన మీడియాతో రేవంత్‌రెడ్డి కొత్త రాగం పాడిస్తున్నారు. అయితే ఎన్ని కూనిరాగాలు తీయించినా ప్రయోజనం లేదనే విషయం రేవంత్‌రెడ్డితో పాటు ఫిరాయింపు ఎమ్మెల్యేలు గుర్తుంచుకోవాలి. ప్రజలు తాము చేసిన పొరపాటును తెలుసుకొని.. 'పొరపాటున చేయిజారిన తరుణం తిరిగొస్తుందా..' అనే పాటను తలుచుకొని చింతిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నం పెట్టిన పార్టీకి ద్రోహం తలపెట్టిన ఎమ్మెల్యేలపై రేపో మాపో వేటు పడడం, ఉప ఎన్నికలు రావడం ఖాయం. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవడం తథ్యం.

(వ్యాసకర్త: బీఎన్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు)




## ఊపిరి నిండా ఉద్యమ జెండా

స్వరాష్ట్ర కలతో పురుడు పోసుకున్న పునాది
స్వాభిమానం నింపుకొన్న ఉద్యమ కాణాచి

జలదృశ్యంలో ఆవిష్కృతమైన ఆశయసౌధం
రెండు దశాబ్దాల చారిత్రక ప్రయాణ తేజం

అడుగు అడుగున స్ఫూర్తి నింపిన నాయకత్వం
అణువణువున ఉత్తేజం మొలిచిన ఉద్యమ తత్త్వం

కోటి గొంతుకలు ఒక్కటైన తెలంగాణ రణ నినాదం
నేటి తరాలకు స్ఫూర్తి చాటిన గులాబీ కేంద్రం

అణచివేతకు ఎదురునిలిచి ఎదిరించిన నైజం
తెలంగాణ ఆత్మాభిమానం ఆవిష్కరించిన ఇజం

రాదు రాదంటూ అడ్డుకున్న కుహనా సమైక్య గారడీ
దీక్షబూని దేశమంతటిని కదిలించిన గులాబీ సారథి

అరవై ఏండ్ల కలకు ఆయువు పోసిన సత్యాగ్రహి
నేటి బంగారు తెలంగాణ కార్య సాధకుడోయి

మన యాసకు మన బాసకు పట్టంగట్టిన వైనం
కొత్త రెక్కలొచ్చి పాలపిట్ట ఎగిరిన తరుణం

సొంత రాష్ట్ర కల నెరవేర్చిన గులాబీ జెండా
సంకల్ప సాధకుడి రూపమే మన గుండెల నిండా..!



రామకృష్ణ మనిమద్దె
94943 53828

## జాతీయపార్టీల గూడుపుఠాణి




పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

**సామాజిక, రాజకీయ ఉద్యమాలకు నెలవైన తెలంగాణ గడ్డపై రాజకీయాలు రోజురోజుకు నవ్వుల పాలవుతున్నాయి. ప్రజా సమస్యలను గాలికొదిలిన రెండు జాతీయ పార్టీలు రాజకీయాలను అటెన్షన్, డెవర్షన్ దిశగా నడిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ సమస్యలు లేవన్నట్టుగా చిత్రీకరిస్తూ కుమ్మక్కవుతున్న తీరును చూసి ప్రజలు ముక్కున వెలేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారం రోజులుగా ప్రధానమంత్రి మోదీని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని తూర్పారబడుతున్నారు. దీంతో తెలంగాణ పాలిటిక్స్ హఠాత్తుగా రేవంత్ వర్సెస్ కిషన్‌రెడ్డిగా మారిపోయాయి.**

దేశంలో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో సామాజిక, రాజకీయ ఉద్యమాలతో ఒకింత చైతన్యం ఎక్కువగా ఉన్నది తెలంగాణలోనే. గతవారం జరిగిన ఐదు నిమిషాల భేటీ తర్వాత రేవంత్‌కు మోదీ హీరో అయిపోతే, కిషన్‌రెడ్డి విలన్ అయిపోయారు. రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని రేవంత్ ఆరోపిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో మోదీకి ఉన్నంత స్పష్టత, సానుకూలత కిషన్‌రెడ్డికి లేవట. మోదీని కలిసిన మరుక్షణంలోనే రేవంత్ చేసిన ఈ ఆరోపణల్లో నిగూడార్థం దాగి ఉన్నదని స్పష్టంగా అర్థమవుతున్నది. కిషన్‌రెడ్డి పనికిరాని కేంద్రమంత్రి అని స్వయానా మోదీ అయినా రేవంత్‌కు చెప్పి ఉండాలి, లేదా నిన్న మొన్నటివరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన రేవంత్, కిషన్‌రెడ్డి మధ్య ఏదో ఒప్పందమైనా బెడిసికొట్టి ఉండాలి. లేదంటే రాహుల్‌గాంధీతో ఏర్పడిన అగాధాన్ని పూడ్చేందుకు బీజేపీని కార్నర్ చేసే కోణమైనా అయి ఉండాలి.

వారం కిందట మోదీతో రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం అధికారిక భేటీ అనంతరం దాదాపు 40 నిమిషాల పాటు మోదీ, రేవంత్ ఏకాంతంగా భేటీ అయ్యారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఈ భేటీ రహస్యాలు బయటకు పొక్కకుండా ఉండేందుకే ప్రతి వేదికపైనా కిషన్‌రెడ్డిని రేవంత్ తూర్పారబడుతున్నారు. ఏ కొద్దిపాటి రాజకీయ పరిజ్ఞానం ఉన్నా వీరి వాగ్వాదంపై అనుమానం కలగకమానదు. బీఆర్‌ఎస్ ప్రస్తావన లేకుండానే ఒకరినొకరు విమర్శించుకోవడం ద్వారా రాజకీయం మొత్తం తమ రెండు పార్టీల మధ్య జరుగుతున్నట్టు కలరింగ్ ఇచ్చే కోణం దాగి ఉన్నది. ఈ మాటల యుద్ధంలో బీఆర్‌ఎస్‌కు ఎక్కడా అవకాశం దొరక్కూడదనుకోవడం అవివేకం.



పార్లమెంట్ ఎన్నికల సమయం నుంచే రేవంత్ బీజేపీ ఫోల్డర్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరిగింది. అందుకనుగుణంగానే మల్కాజిగిరి, కరీంనగర్, సికింద్రాబాద్, చేవెళ్ల, మెదక్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ వీక్ అభ్యర్థులను పెట్టి తెలంగాణలో పరోక్షంగా బీజేపీకి సహకరిస్తున్న వైనం తేటతెల్లమైంది. ఇది రేవంత్‌పై రాహుల్‌కు నమ్మకం సన్నగిల్లేలా చేసింది. ఇటీవల రాహుల్‌ను కలిసి వచ్చిన రేవంత్‌రెడ్డి పార్టీ సీనియర్లు తన కుర్చీకి ఎసరు పెడుతున్నారని ఏకరువు పెట్టారు. ఇక్కడ ప్రజల్లోనూ నమ్మకం కోల్పోయి, అక్కడ రాహుల్ వద్దా పతారా పాడుచేసుకున్న రేవంత్‌కు ఇప్పుడున్న ఏకైక దిక్కు మోదీనే. రాహుల్ ఇవ్వకపోయినా మోదీ తనకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నట్టు చెప్పుకోవడం గమనార్హం. తేడా వస్తే ఆరెస్సెస్‌తో జత కట్టేందుకు కూడా రెడీ అని అనుచరులకు రేవంత్ చెప్పినట్టు తెలిసింది.

మరోవైపు, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు మోదీ, రేవంత్ మధ్య సయోధ్య కుదిరిందని, వీరి మధ్య కిషన్‌రెడ్డి బఫూన్‌లా మారారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్నీ రేవంత్ సర్కారు పాతర వేస్తున్నది. ఎగవేతలు, దాటవేతల ప్రభుత్వంగా మారిపోయింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిని ఆత్మహత్యలు చేసుకుంటున్న గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. నీళ్లు లేక, నిధులు లేక వ్యవసాయరంగం మళ్లీ కుదేలైంది. నేత, గీత, కమ్మరి, కుమ్మరి, యాదవ, ముదిరాజ్ వృత్తులు ఏడాదిన్నరలోనే మూలనపడ్డాయి. హాస్టల్ విద్యార్థుల హాహాకారాలు, విద్యార్థుల ఆకలిచావులు పాలనను వెక్కిరిస్తున్నాయి. తాజాగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో 8 మంది చనిపోయారు. పది రోజులైనా మృతదేహాలను వెలికితీయని అసమర్థ సర్కారుగా పేరు తెచ్చుకున్నది. వైఫల్యాల నుంచి గట్టెక్కేందుకు మిస్టరీ మరణాల పేరుతో అటెన్షన్ డైవర్షన్‌కు పాల్పడుతున్నారు. రేవంత్ గద్దెనెక్కి 14 నెలలైనా ఇప్పటి వరకు పూర్తిస్థాయి క్యాబినెట్ లేదు. దీంతో అన్ని శాఖల్లోనూ వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రతి ఐదు గంటలకో అత్యాచార ఘటన జరుగుతున్నది. మహిళలకు రక్షణ కరువైంది.

తాము అధికారంలోకి వస్తే నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామన్న బీజేపీ హామీ నీట మునిగింది. కోట్లమంది పేదలను బ్యాంకుల ముందు లైన్లలో, టైమ్ స్లాటుల్లో నిలబెట్టింది. హేతుబద్ధత లేని ట్యాక్స్ స్లాబ్‌లు తీసుకొచ్చి ఎన్నో వ్యాపారాలు కుదేలు కావడానికి కారణమైంది. మరోవైపు, కనిపించిన ప్రతి సంస్థను ప్రైవేటుకు అమ్మేస్తూ విమర్శలు మూటగట్టుకున్నది. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోనూ పోరాడుతున్నది ఒక్క బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే. ఇవాళ తెలంగాణ సమాజం ఏడాదిలోనే ఏం కోల్పోయిందో తెలుసుకున్నది. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న నాటకాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయ చైతన్యం పుష్కలంగా ఉన్న తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయం.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)